క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట పోచంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల సాయంతో జనతా గ్యారేజ్ మానవతామూర్తుల సంస్థ బాధ్యులు శుక్రవారం నోట్ పుస్తకాలు అందజేశారు. మనం, మన ఊరి బడి అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినట్లు బ్లడ్ డోనర్ మోటివేటర్, కానిస్టేబుల్ కన్నె రాజు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేదాంతచారి, ఉపాధ్యాయులు సలీం, శశిధర్ రెడ్డి, జ్యోతి, రజిత, సృజన పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల అందజేత



వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్ చార్‌బౌళి పాఠశాలలోని విద్యార్థులకు హిమాన్షు సాహా, కోవిడ్ సాహా అనే విద్యార్థుల తల్లిదండ్రులు ఎం.శ్రీలత, రాజు దంపతులు శుక్రవారం డైరీలను అందజేశారు. విద్యార్థులు హోంవర్క్ వివరాలను నమోదు చేసుకుని ఇంటికి వెళ్లాక పూర్తి చేసుకునేందుకు ఈ డైరీలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీ.కవిత, స్టాఫ్ సెక్రెటరీ బండారి గంగాధర్ తిలక్, ఉపాధ్యాయులు రమేష్, నర్సింగరావు, డి.శ్రీనివాస్, నీరజ, లక్ష్మి, స్వప్న, సుకన్య, హరికృష్ణ, అశోక్, అలీ పాల్గొన్నారు.

లతకు డాక్టరేట్



హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన పంజాల లతకు రాజస్తాన్‌లోని మేవార్ యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. డాక్టర్ కుమావత్, డాక్టర్ నిరంజన్ పర్యవేక్షణలో 'మెకానిజమ్స్ ఫర్ ప్రైవసీ ప్రెసర్ వింగ్ బిగ్ డేటా మైనింగ్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆమెకు డాక్టరేట్ లభించింది. లత ప్రస్తుతం గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కరీమాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని టీఎస్‌ఎస్పీ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ అన్నారు. మామునూరు టీఎస్‌ఎస్పీ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న క్రీడలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనడం ద్వారా కొంతమేర ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో 5వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ సోమాని, రాంబాబు, జయరామ్, ఆర్‌ఐలు కార్తీక్, సోలమన్‌రాజు, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

మాలల సంక్షేమానికి కృషి



హసన్‌పర్తి: మాల కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. దళితబంధు పథకంలో మాలలకు 50శాతం యూనిట్లు కేటాయించేలా చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు. హంటర్ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాల సంఘం ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపికలోనూ ప్రాధాన్యం కల్పిస్తానని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఐనవోలు వైస్ ఎంపీపీ తంపుల మోహన్, మాల కులస్తుల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్, బీఆర్‌ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ జట్టి రాజేందర్, సభ్యులు గరిగె మురళి, కుమార్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన అధికారులు

వరంగల్ క్రైం: నూతనంగా గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.గోపి, వరంగల్, కాజీపేట ఎస్సైలుగా నియమించబడిన రణధీర్, రామారావులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి రంగనాథ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు. పారదర్శకంగా విధులు నిర్వరిస్తూ నిరుపేదలకు న్యాయం చేయాలని వారికి సీపీ సూచించారు.

రెడ్డి బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఆపై చదువుకునే బాలికలు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వార్డెన్ శోభారెడ్డిని 96766 49811 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

కాజీపేట: గ్రానైట్ లారీల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీ సమీపంలోని క్వారీ పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి చీఫ్‌విప్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కిరణ్‌కుమార్, గనుల శాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న నగరానికి మంత్రి నిరంజన్ రాక

రామన్నపేట: హనుమకొండ గోకుల్‌నగర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సహకార శిక్షణ కేంద్ర శంకుస్థాపన కార్యక్రమానికి ఈనెల 19వ తేదీన మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి రానున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. వరంగల్ కల్పలత సూపర్‌బజార్ పెట్రోల్ పంపు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం అంబేద్కర్ భవన్‌లో పట్టణ ప్రాంత సహకార సంఘాల సదస్సు ఉంటుందని తెలిపారు.



చీఫ్‌విప్‌కు మొక్క అందిస్తున్న జర్నలిస్టులు

ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

హన్మకొండ: తెలంగాణ ఉద్యమంలో ఫొటో, వీడియో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఒకరి కోసం అందరు.. అందరి కోసం ఒకరు.. అనే నినాదంతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకుని కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ ఫొటో, వీడియో జర్నలిస్టుల సహకార సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా సంపెట వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పెద్దపల్లి వరప్రసాద్, కోశాధికారిగా గొట్టె వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా గోకారపు శ్యాంకుమార్, ఉపాధ్యక్షులుగా సంపెట సుధాకర్, తోట తిరుమల రావు, సహాయ కార్యదర్శులుగా చేతి శ్రీనివాస్, బొడిగె శ్రీను ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

48వ డివిజన్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ ఆహ్వానించారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి విమర్శించారు. ధరల పెరుగుదలపై హనుమకొండలోని కాళోజీ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో తరాజులో ఒకవైపు డబ్బులు, నిత్యావసర వస్తువులు మరో వైపు పెట్టి తూకం వేసి వినూత్న రీతిలో నిరసన తెలుపుతూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రిస్తామని చెప్పి కేంద్రంలో అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం.. తొమ్మిదేళ్లు గడిచినా నియంత్రించక పోగా, ధరలు అమాంతం పెంచిందని ధ్వజమెత్తారు.

విద్యార్థి చదువుకు లయన్స్ క్లబ్ చేయూత

హన్మకొండ: జెడ్పీహెచ్‌ఎస్ తిడుగు పాఠశాలలో చదివి పదవ తరగతిలో 9.2 జీపీఏతో ఉత్తీర్ణత సాధించిన ఎస్.శ్రీజ.. హనుమకొండలోని షైన్ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందింది. కళాశాలలో ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత విద్యార్థిని శ్రీజకు లేదని తెలుసుకున్న హనుమకొండకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ చేయూతనందించింది. ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి ఫీజు చెల్లించనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు చల్లా రఘునాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు షైన్ జూనియర్ కళాశాల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్‌కు ఫీజు రూ.50 వేల నగదును లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ ఎస్‌వీడీజీ సలీం, ప్రతినిధులు చంద్రశేఖర్ ఆర్యా, మార్గం ప్రభాకర్, చంద్రమోహన్, రేణుకుంట్ల ప్రకాశ్, దండె ప్రవీణ్, డి.సదానందం. జెడ్పీహెచ్‌ఎస్ తిడుగు ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్‌కుమార్, షైన్ కళాశాల ప్రిన్సిపాల్ మారబోయిన రాజు గౌడ్, ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



శ్రీజ ఫీజు చెల్లిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

కాశిబుగ్గ: సామాజిక భద్రత కోసం సీపీఎస్ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) డాక్టర్స్ సంఘం కార్యదర్శి డాక్టర్ వెంకటస్వామి, సీపీఎస్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ డిమాండ్ చేశారు. ఈనెల 16నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో శుక్రవారం ఆవిష్కరించారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభి సహీతో కబీ నహీ అనే నినాదంతో జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ వద్ద ప్రారంభం కానున్న యాత్ర జూలై 21న వరంగల్ జిల్లాలోకి చేరుకుంటుందని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మడికొండ: చేసిన అప్పులు ఎక్కువై మనస్థాపంతో ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ గ్రామం అయోధ్యపురం రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన శివరాత్రి కొంరయ్య(47) కూలీ పనులు చేసుకుంటూ తాగుడుకు బానిసై ఎక్కువ అప్పులు చేశాడు. ఈక్రమంలో అప్పులు చెల్లించలేక మనస్థాపంతో శుక్రవారం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన మడికొండ శివారు వెస్ట్ సిటీలో జరిగింది. ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం నెక్కొండ మండలం నక్కలగుట్ట తండా నుంచి బతుకుదెరువు కోసం కాజీపేట మండలం మడికొండకు వచ్చి శివారులోని వెస్ట్ సిటీలో మాడు బుల్లి (38), ఈరు దంపతులు జీవిస్తున్నారు. కాగా, ఈరు రోజూ మద్యం తాగివచ్చి తన భార్య బుల్లితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా గొడవ జరగగా బుల్లి తన ఒంటిపై టార్పెంట్ ఆయిల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం బుల్లి మృతి చెందింది. మృతురాలి కుమారుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

యువతి అదృశ్యం

కరీమాబాద్: ఎస్ఆర్‌ఆర్ తోటకు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చెందిన తాడెం స్వరూప కుమార్తె నవ్య(18) ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్‌కు సన్నద్ధమవుతోంది. అయితే, గురువారం మధ్యాహ్నం తర్వాత నవ్య కనిపించలేదు. ఎంత వెతికినా యువతి ఆచూకీ తెలియకపోవడంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో తల్లి స్వరూప ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీసీబీ ఉద్యోగికి అండగా అధికారులు, ఉద్యోగులు



చెక్కు అందిస్తున్న రవీందర్ రావు, తదితరులు

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ జనగామ బ్రాంచ్‌లో పని చేస్తూ ప్రమాదానికి గురైన స్టాఫ్ అసిస్టెంట్ ఖదీర్‌కు ఆ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న ఖదీర్ కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. ఖదీర్ రెండు నెలల క్రితం ప్రమాదానికి గురయ్యారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగులు విరాళాలుగా పోగు చేసిన రూ.1.03,100లను చెక్కు రూపేనా ఖదీర్ కుటుంబ సభ్యులకు డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీధర్, డీజీఎంలు రోహిణి, దమయంతి, కురువ నాయక్, ఏజీఎంలు నవీన్, రాధిక, సహకార ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రజిత, ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

నేటి బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బైరి రవికృష్ణ

నయీంనగర్: బీసీ ముఖ్యమంత్రితో పాటు మిషన్ -60 (బీసీలకు 60 ఎమ్మెల్యే టికెట్లు) డిమాండ్‌తో జూలై 15న ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించ తలపెట్టిన బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవికృష్ణ మాట్లాడుతూ 10వేల మంది ప్రతినిధులతో నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీ.. తెలంగాణలో రాజకీయాలను శాసించబోతుందన్నారు. సమావేశంలో బీసీల రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయిస్తామని తెలిపారు. జనాభాలో అధిక భాగం ఉన్న బీసీలకు గడిచిన 76 ఏళ్లలో ఏపార్టీ కూడా సీఎం పదవి ఇవ్వలేదన్నారు. వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అన్ని బీసీ కులాల నాయకులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

వృద్ధులకు వైద్యసేవలందించాలి

గీసుకొండ : వృద్ధులను తల్లిదండ్రుల్లా ఆదరించి వారికి సత్వర వైద్యసేవలు అందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో హనుమకొండ జిల్లా విద్యారణ్యపురి గోపాలపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం వారికి సత్వర వైద్యసేవలు అందించాలన్నారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ వృద్ధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని, వారిని ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు తీసుకునేలా చట్టాలు ఉన్నాయని తెలిపారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మచ్చిక నర్సింహరామయ్య, కొండబత్తుల రాజేందర్, వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు కె.మల్లారెడ్డి, ఆడెపు రాజేంద్రప్రసాద్, తేరాల యుగేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

20న నులిపురుగుల నివారణ దినోత్సవం

జిల్లాలో ఈ నెల 20న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటరమణ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నులిపురుగుల దినోత్సవం, ఇంద్రధనుస్సు కార్యక్రమాలపై శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల్లోపు 1.91 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమం రోజు మాత్రలు వేసుకోలేని వారికి 27న అందించాలన్నారు. కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు.

ధ్రువపత్రాలను తక్షణమే జారీ చేయాలి

ఖిలా వరంగల్: విద్యార్థులు, నిరుద్యోగులకు కుల, ఆదాయ ధ్రువ పత్రాలను మండల రెవెన్యూ అధికారులు తక్షణమే జారీ చేయాలని బీజేపీ నేత కుసుమ సతీష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం తహసీల్‌లో తహసీల్దార్ ఫణికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు పైచదువుల కోసం, నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం కుల, ఆదాయం ధ్రువ పత్రాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, రంజిత్, వెంకటేష్, అరుణ్, బైరి మురళీకృష్ణ, ఓంప్రకాశ్, కొలారియా, జక్కన్న, రాజు, శ్రీను, కిరణ్, గొర్రె కోటి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దళితులకు న్యాయం చేయాలి



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీమాబాద్: రాష్ట్రంలో దళితబంధు, సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలుచేసి దళితులకు న్యాయం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. పథకాల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జక్కలొద్దిలో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అర్హులైన దళితులందరికీ పార్టీలకతీతంగా దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, మూడెకరాల భూమి, డప్పు కొట్టేవాళ్లు, చెప్పులు కుట్టేవాళ్లకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లాడి రాంరెడ్డి, ఎర్ర రాములు, మైదం వీరస్వామి, మైదం అజయ్, మైదం అభిలాష్ పాల్గొన్నారు.

ఉచిత సేవలను వినియోగించుకోవాలి

న్యూశాయంపేట: ఓటరు లిస్టులో పేర్ల సవరణ, నూతన ఓటర్ల నమోదుకు వరంగల్ మిల్లత్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సేవ కేంద్రాన్ని మామునూరు, తిమ్మాపూర్, రంగశాయిపేట, పెన్షన్‌పూర్, లక్ష్మీపూర్, అలీపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ బాధ్యులు మహ్మద్ జాఫర్‌బాబా, అబ్దుల్‌ఖాన్ తెలిపారు. 43వ డివిజన్ లక్ష్మీపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత సేవ కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రం ఈనెలాఖరు వరకు పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు మహ్మద్ షకీల్ అహ్మద్‌తో పాటు పెన్షనర్స్ సంఘం కార్యదర్శి ఇనుగాల జ్యోగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిటీ బాధ్యులు

నగరంలో నేడు.. రేపు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పింజర్ల, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9.30గంటల వరకు, వరంగల్‌లోని మామునూరు, బొల్లికుంట, కరీమాబాద్, శంభునిపేట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ కోత విధిస్తున్న వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

నీటి సరఫరా బంద్

హసన్‌పర్తి: పలివేల్పుల ఫిల్టర్‌బెడ్‌లో ఏర్పడిన సాంకేతిక కారణాలతో హసన్‌పర్తి, ఎర్రగట్టు గుట్ట ప్రాంతాల్లో శనివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరి తెలిపారు.

శని త్రయోదశి పూజలు

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో శనివారం శనిపూజలు, నవగ్రహాలు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నయీంనగర్: కాళ్ల నరాల వాపు (వేరికోస్ వెయిన్స్), పైల్స్, ఫిషర్స్, ఫిస్టులాకు సంబంధించి విజయటాకీస్ రోడ్డులోని హెల్త్ ప్లస్ హాస్పిటల్‌లో ఈనెల 16న ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ బాలాజీ పటేల్ కోలా తెలిపారు.

మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశం

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాల మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశాన్ని హనుమకొండ రాంనగర్‌లోనికృష్ణ డేకర్స్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు.

సంక్షిప్తంగా

పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం

ఖిలా వరంగల్: వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ సూచించారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

కరీమాబాద్: వర్షాకాలంలో ఇళ్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

కరీమాబాద్: పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు వేతన సవరణ చేసి పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు.

31న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: దళిత బంధు, సంక్షేమ పథకాల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 31న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎలేందర్ పిలుపునిచ్చారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనున్న విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు పిలుపునిచ్చారు. ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం శుక్రవారం జరిగింది.

సమానంగా దళితబంధు ఇవ్వాలి

హన్మకొండ: మాల, మాదిగలకు సమానంగా దళిత బంధు పథకం వర్తింపజేయాలని జాతీయ మాల మహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు.

రైల్వేస్టేషన్‌లో ఆటో పార్కింగ్ ఇవ్వాలి

కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆటోలు నిలిపి ఉంచేందుకు స్థలం కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, జేడీఆర్‌యూసీసీ సభ్యుడు ఎరుకుల రఘునారెడ్డి కోరారు. ఈమేరకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు శుక్రవారం వచ్చిన సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అభయ్‌కుమార్ గుప్తాను కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

హసన్‌పర్తి: ముచ్చర్ల క్లస్టర్‌లోని భీమారం రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు సంగాల విక్టర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ధీరజ్‌సాయి

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న 39వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ స్విమ్మింగ్ పోటీలకు హనుమకొండకు చెందిన ధీరజ్‌సాయి ఎంపికైనట్లు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ మోనల్ డీ చోక్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కాజీపేట అర్బన్: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు.

రైల్వే స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రామకృష్ణ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొని 38మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

బీజేపీ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఖిలా వరంగల్: బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

డీజిల్‌కాలనీలోని రైల్వే ఆలయంలో పూజలు

కాజీపేట రూరల్: శాకాంబరి ఉత్సవాలను పురస్కరించుకొని కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు, రైల్వే డీఎంఆర్‌కేఎస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మోతీలాల్ పూజలు నిర్వహించారు.

ఘనంగా అక్కలమ్మ పండుగ

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ దర్గా పవన్‌నగర్‌లోని అక్కలమ్మ ఆలయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు.

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు.

నేడు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముట్టడి

కేయూ క్యాంపస్: ఈనెల 15న హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముట్టడి చేపట్టనున్నట్లు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్రరాజు గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట గోపినాథ్, రాష్ట్ర కో కన్వీనర్ మంతిని శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరించాలి



వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, గుమస్తా, రైతులు, కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు మార్కెట్ యార్డ్ ఆవరణలో కేటాయించిన 35 గుంటల స్థలంలో ట్రేడ్ ప్రమోషన్ సెంటర్ భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కొత్త అడ్తి లైసెన్సులు జారీ చేయాలని, మార్కెట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలతో పాటు ఖరీదుదారులకు కార్యాలయాలు మంజూరు చేయాలని సూచించారు.